క్లుప్తంగా

డీఎస్పీని కలిసిన శ్రీ మఠం అధికారులు



ప్రసాదం అందజేస్తున్న మఠం అధికారులు

మంత్రాలయం : ఎమ్మిగనూరు డీఎస్పీగా నూతనంగా నియమింపబడిన సీతారామయ్యను శనివారం ఎమ్మిగనూరులోని ఆయన కార్యాలయంలో శ్రీ రాఘవేంద్రస్వామి మఠం మేనేజర్ ఎస్.కే.శ్రీనివాసరావు, ఏఏఓ మాధవ శెట్టి మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా స్వామి వారి పరిమళ ప్రసాదం, మెమొంటో అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

8 నుంచి విజ్ఞాన శిబిరం

ఆదోని అర్బన్ : ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిణి సుజాత శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం ఉంటుందని చెప్పారు. శిబిరానికి రిటైర్డ్ హెచ్ఎం ప్రసాద్ పిల్లలకు నీతి కథలు, నైతిక విలువలు నేర్పిస్తూ జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించి విజ్ఞానం పెంపిస్తారన్నారు.

శ్రీ మఠంలో కర్ణాటక మంత్రి



శ్రీ మఠం పీఠాధిపతి చేతుల మీదుగా మెమొంటో అందుకుంటున్న మంత్రి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక మంత్రి బోసేరాజు శుక్రవారం రాత్రి మంత్రాలయం వచ్చిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయనకు శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షితలిచ్చి స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. అంతకు ముందు ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అలాగే.. మంత్రి బోస్ రాజును మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు.

అంగన్‌వాడీ గోదాములో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మంత్రాలయం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గదుల్లో ఒక గదిని అంగన్‌వాడీ సామగ్రిని నిల్వ ఉంచుకునేందుకు కేటాయించారు. శనివారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ కారణంగా గదిలో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య సంఘటనా స్థలానికి చేరుకుని ఎమ్మిగనూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. గదిలో నిల్వ ఉన్న పాత పుస్తకాలు, కుర్చీలు అగ్నికి పూర్తిగా అహుతయ్యాయి. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఫోన్ ద్వారా ప్రమాదం వివరాలను తెలుసుకున్నారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత



వీరాచారితో వేలిముద్ర వేయించుకుంటున్న వలంటీర్ ఈ.పురంధర్

ఆదోని రూరల్ : మండలంలోని చిన్నపెండేకల్ గ్రామానికి చెందిన కమ్మరి వీరాచారి అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ ఈ.పురంధర్ శనివారం అక్కడికి వెళ్లి వృద్ధాప్య పింఛన్ సొమ్ము అందజేశాడు.



దేవనూరులో లక్ష్మమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ రాఘవేంద్ర

కౌతాళం: మండలంలోని ఉప్పరహాల్‌కు చెందిన లక్ష్మమ్మ కంటి ఆపరేషన్ చేయించుకొని కర్ణాటక రాష్ట్రంలోని దేవనూరులోనున్న తన కుమార్తె వద్ద ఉంటోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ రాఘవేంద్ర అక్కడి వెళ్లి ఆమెకు పింఛన్ సొమ్ము అందజేశాడు.

జోరుగా ఇళ్ల నిర్మాణాలు

- నందడిగా జగనన్న కాలనీలు
- డివిజన్‌కు 21,874 ఇళ్లు మంజూరు
- రూ.393.73 కోట్లతో సాగుతున్న పనులు
- 4,882 గృహాలు పూర్తి
- 149.94 కోట్లు ఇప్పటికే ఖర్చు
- కాలనీల్లో వసతుల కల్పన



ఆదోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు

ఆదోని సెంట్రల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఆయా గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన కాలనీల్లో నిర్మాణ పనులు జరుగుతుండటంతో ఆయా ప్రాంతాలు సందడిగా ఉంటున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం కాలనీల్లో మౌలిక వసతులు కల్పించింది. వచ్చే నెల 15వ తేదీ నాటికి ఐదు లక్షల మందికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. దీంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు అధికారులు, సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు వేగవంతం చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఆయా కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించే పనులు వేగంగా సాగుతున్నాయి.

డివిజన్ పరిధిలో..

ఆదోని డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాలకు 21,874 ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందజేస్తుంది. ఆదోని, కోసిగి, మంత్రాలయం, నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు,హోళగుంద మండలాల్లో దాదాపు రూ.393.732 కోట్లతో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు 4,882 ఇళ్లు పూర్తి కాగా, 243 ఇళ్లు స్లాబ్ లెవెల్, 872 ఇళ్లు రూఫ్ లెవెల్, 5,591 బేస్ మట్టం లెవెల్, 10,279 ప్లింత్ బీమ్ లెవెల్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు సుమారు రూ.149.94 కోట్లను వివిధ పనులకు ఖర్చు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలనీల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. కాలనీలో పార్కు, దేవాలయం, బడి వంటివి ఏర్పాటు చేసే దిశగా పనులు జరుగుతున్నాయి.

నిర్మాణాలు ఇలా..

- ఆదోని పట్టణంలోని జగనన్న కాలనీలో 170.81 ఎకరాల్లో 9,327 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మొదటి విడతలో పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో 7,583 ఇళ్లు మంజూరయ్యాయి. ఇళ్ల నిర్మాణాల కోసం రూ.33.54 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటి వరకు 893 ఇళ్లు పూర్తికాగా, 68 ఇళ్లు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయి. 2,286 లెంటల్ లెవెల్, 4,230 బేస్‌మట్టం దశలో ఉన్నాయి. నీటి వసతి కోసం రూ.7.69 లక్షలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.0.16 లక్షలు, అంతర్గత రహదారుల కోసం రూ.11.93 లక్షలు ఖర్చు చేశారు.
- ఎమ్మిగనూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 3,304 ఇళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాల కోసం రూ.5.94 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే 1,054 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశలో పనులు జరుగుతున్నాయి.
- కోసిగి మండలానికి 2,996 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందుకు రూ.5.39 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రస్తుతానికి 861 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన వాటిలో 15 రూఫ్‌లెవెల్, 207 టాప్ లెవల్‌తో పాటు వివిధ దశలో ఉన్నాయి.
- మంత్రాలయం మండలానికి 2,429 ఇళ్లు మంజూరయ్యాయి. రూ.2.42 కోట్లతో నిర్మాణాలు చేపడుతున్నారు. 522 ఇళ్లు పూర్తయ్యాయి. 7 రూఫ్ లెవెల్, 84 టాప్ లెవెల్‌తో పాటు వివిధ స్థాయిల్లో పనులు చేస్తున్నారు.

నెలాఖరు నాటికి పూర్తి చేసేలా పనులు



ఈనెల 30వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా పనులు చేయిస్తున్నాం. జూలై 15 వతేదీ నాటికి గృహ ప్రవేశాలు జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. థర్డ్ పార్టీ (కంట్రాక్ట్) వారు నిర్మిస్తున్న ఇళ్లను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని సూచించాం. కూలీల కొరత వల్ల పనులు కొంత ఆలస్యంగా జరుగుతున్నాయి. త్వరగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎం.రవికుమార్, డీఈ

ఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన



కార్యాలయ నిర్మాణం కోసం ట్రాన్స్‌కో 220 కేవీ సబ్ స్టేషన్‌లో చర్చిస్తున్న సభ్యులు

కర్నూలు(రాజ్‌విహార్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) ప్రధాన కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలం పరిశీలించారు. శనివారం కమిషన్ సభ్యులు నగర శివారులోని దిన్నెదేవరపాడు రోడ్డులో (ఏపీ కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద) ఉన్న ట్రాన్స్‌కో సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. 220 కేవీ సామర్థ్యం ఉన్న ఉప కేంద్రానికి సంబంధించిన స్థలాలను తనిఖీ చేశారు. ఈ సబ్ స్టేషన్‌లోని రెండు ఎకరాల స్థలంలో ఈఆర్‌సీ పక్కా భవనాన్ని నిర్మించేందుకు గత నెల 26వ తేదీన కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈఆర్‌సీ సెక్రటరీ కె.రాజబాపయ్య, సభ్యులు ఠాకూర్ రామసింగ్ కర్నూలుకు వచ్చి సివిల్, ఎలక్ట్రికల్ అధికారులు సమావేశమయ్యారు. స్థలం, స్వభావం, భవన నిర్మాణం కోసం ప్రణాళికలు పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులను ఎస్ఈలు ఉమాపతి, కృష్ణకుమార్, సివిల్ అధికారులు వివరించారు. సభ్యుల వెంట ఈఈ రజినీకాంత్ రెడ్డి ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి వైద్యశిబిరానికి హాజరైన రోగులు

ఆదోని అర్బన్ : ఆర్యవైశ్య అఫీషియల్స్ మరియు ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), అవోపా మహిళా విభాగ్ ఆదోని విభాగం ఆధ్వర్యంలో విశ్వభారతి ఆస్పత్రి కర్నూలు వారి సహకారంతో కాకుబాల్ నగేష్ సౌజన్యంతో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శిబిరానికి 853 మంది హాజరయ్యారు.వీరిలో 258 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వారందరికీ ఉచితంగా ఆపరేషన్లు చేయించి, అద్దాలు, మందులు అందజేస్తామని అవోపా ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు మిరియాల శ్రీధర్, సభ్యులు ప్రతాప్, ఈరన్న, రత్నయ్య, రంగనాయకులు, రాంప్రసాద్, రమేష్, మహిళా విభాగ్ కార్యదర్శి మమతాశ్రీ, సభ్యులు హిమబిందు, గీత, పూజ, కీర్తి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

ఆదోని రూరల్ : బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో బాల్యవివాహాలను నిరోధించడం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండలంలోని ఆయాశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు చేసే వారికి నష్టాలపై వివరించాలన్నారు. చిన్న వయస్సులో ఆడపిల్లకి పెళ్లి చేయడం వల్ల శారీరక ఎదుగుదల, మానసికంగా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రాణానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్ : బాల్యవివాహాలు ఆలూరు, ఆదోని, పత్తికొండ ప్రాంతాల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి కోరారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో బాల్యవివాహాలు అరికడట్టడంపై మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు.

రైతు బజార్ తనిఖీ

పాత బస్టాండు సర్కిల్‌లోని రైతు బజార్‌ను మున్సిపల్ కమిషనర్ శనివారం తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ధరలతోనే కూరగాయలు విక్రయిస్తున్నారా, లేక అధిక ధరలతో విక్రయాలు జరుపుతున్నారా అనే విషయంపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నపిల్లల పార్కు, లేఅవుట్ ఓపెన్ స్థలాలను సందర్శించారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మెప్మా ప్రాజెక్టు అధికారి, ఐసీడీఎస్ సీడీపీఓ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో అనారోగ్యం దూరం



సైక్లింగ్ ర్యాలీలో పాల్గొన్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆదోని అర్బన్/ఆదోని సెంట్రల్: సైకిల్ తొక్కడం వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయని రోటరీ క్లబ్ సభ్యులు బసవరాజు, శివరాం, నిశాంత్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా సభ్యుల ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలు, పురుషులు సైకిల్ ర్యాలీ చేపట్టారు. వినీత, అనురాధ, సుజాత, రఘు,రాజేష్, రుక్మిణి, విట్టా శర్వాణి పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



కర్ణాటక మద్యం తరలిస్తున్న మహిళలను అరెస్టు చేసిన సెబ్ పోలీసులు

ఆదోని రూరల్: మండలంలోని ఉరుకుంద క్రాస్ రోడ్డు వద్ద బంటకుంట గ్రామానికి చెందిన రాజశేఖర్‌గౌడ్ మోటార్ సైకిల్‌పై నాలుగు బాక్సుల్లో కర్ణాటక మద్యం రవాణా చేస్తుండగా గుర్తించి అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ హరికృష్ణ శనివారం తెలిపారు. అలాగే ఆదోని పట్టణంలోని సిరుగుప్ప క్రాస్ రోడ్డు వద్ద ఆదోనికి చెందిన లక్ష్మి, ఈరమ్మ, హనుమంతమ్మ, చంద్రావతి అనే మహిళలు నాలుగు బాక్సుల కర్ణాటక మద్యం కలిగి ఉండగా, గుర్తించి వారిని అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సెబ్ ఎస్ఐలు శివప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, పీసీలు సోమేష్, ఎమ్మిగనూరు బీఎంపీపీ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



కప్పట్రాళ్ల గ్రామస్తులతో సమావేశమైన పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

ఆలూరు/దేవనకొండ: పత్తికొండ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ఫ్యాక్షన్ ముఠాకక్షలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోక తప్పదని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం గ్రామంలో ఉన్న పోలీస్ అవుట్ పోస్టును తనిఖీ చేశారు. అనంతరం గ్రా మస్తులతో సమావేశమయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా జీవితాలను మార్చుకోవాలన్నారు. మూర్ఖంగా ముఠాకక్షలకు పా ల్పడటం కుటుంబాలు, బంధువులు, మిత్రులు, భార్య బిడ్డలకు దూరంగా జైళ్లకు వెళ్లిపోవడం మాను కోవాలన్నారు. ఆయన వెంట పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, దేవనకొండ ఎస్ఐ భూ పాలుడు, పోలీసులు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

కోసిగి: మండలంలోని వందగల్లు గ్రామంలో పిడుగు పాటుకు మృతి చెందిన మాలదాసరి చిన్నవీరేష్ కుటుంబానికి కొల్మాన్‌పేట అర్జున్ శనివారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశాడు. నగదును మృతుడి భార్య రత్నమ్మకు అందజేశారు.

వీధి దీపాల ఏర్పాటు

కోసిగి: మండల కేంద్రంలో ఏరు వాక పండుగను పురస్కరించుకుని కొండపై వెలసిన తిమ్మప్ప స్వామి వారిని భక్తులు సోమవారం దర్శించుకొని పూజలు నిర్వహించడం సంప్రదాయం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో కొండపై ఉన్న విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేయించారు.

ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఎమ్మిగనూరురూరల్: ఉపాధిహామీ పథకంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనం ఆవరణలో ఉపాధిహామీ పథకంలో 16వ సామాజిక తనిఖీపై బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధి పనులను పారదర్శకంగా జరపాలన్నారు. మండలంలో 16 పంచాయతీల్లో ఉపాధిహామీ కింద రూ. 9,93,78,792 లు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయల భవన నిర్మాణాలకు రూ. 4,73,88,338 చెల్లించినట్లు చెప్పారు. రెండు రకాల పనుల కింద మొత్తం రూ.14,67,67,130 చెల్లించినట్లు తెలిపారు. అయితే, మల్కాపురం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించటం, కొలతలు సరిగా లేకపోవటంతో సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పారు. టెక్నికల్ అసిస్టెంట్ అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నారని, తరువాత విచారిస్తామన్నారు. మొత్తం రూ.41,456 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు.

పండ్లతోటలు పెంపకంపై దృష్టి సారించాలి

రైతులు ఉపాధి హామీ కింద పండ్ల తోటలు పెంపకంపై దృష్టి సారించాలని డ్వామా పీడీ సూచించారు. ఓర్వకల్లు, ఆలూరు, బనవాసి నర్సరీల్లో పండ్ల మొక్కలతో పాటు కూరగాయలు, కానుగ, మునగ మొక్కలను పెంచుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో వలసల నివారణకు స్థానికంగానే పనులు కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో అడిషనల్ పీడీ సలీంబాషా, జిల్లా విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి, ఏపీడీ అల్లీపీరా, ఎంపీపీ గొల్ల కేశన్న, ఎంపీడీఓ బంగారమ్మ, ఏపీఓ విజయమోహన్, వివిధశాఖల అధికారులు, ఉపాధి సిబ్బంది, ఎఫ్ఏలు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

పత్తికొండ రూరల్: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బంగి శ్రీధర్, సురేష్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ప్రభుత్వ మెడికల్ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఇరిగేషన్ ఉద్యోగులు ఒక్కరోజు నిరాహార దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజశేఖర్, తాలూకా నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఆదోని సెంట్రల్: ఒడిసాలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు దిలీఫ్ ధోకా కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మృతులకు నివాళులర్పించి మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యుజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మారుతిరావు, పట్టణ కార్యదర్శి సాయినాథ్, నాయకులు దేవిశెట్టి వీరేష్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగల చోరీ

కోసిగి: మండలకేంద్రానికి చెందిన పెండేకంటి నరసన్న, రాముడుకు చెందిన పొలాల్లోనున్న వ్యవసాయ విద్యుత్ మోటార్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. పొలంలో వ్యవసాయ మోటార్‌కు వేసిన తాళం పగలగొట్టి లోపల ఉన్న వైర్లు ఎత్తుకెళ్లారు. దీంతో బోరులో ఉన్న మోటార్ పడిపోయిందన్నారు. మోటార్ పడిపోవడంతో పత్తి పంటకు నీళ్లు కట్టేందుకు ఇబ్బందికరంగా మారిందని రైతులు వాపోయారు. చోరీపై ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

కర్ణాటక భక్తుల పాదయాత్ర

ఆదోని అర్బన్ : మంత్రాలయంలో వెలసిన గురు రాఘవేంద్రస్వామిని దర్శించుకోవడానికి ఏటా కర్ణాటక భక్తులు కాలినడకన వస్తారు. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ నుంచి ముగ్గురు భక్తులు 400 కి.మీ. నడిచి శనివారం ఆదోనికి చేరుకున్నారు. తమకు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమని రెండు సంవత్సరాల నుంచి కాలినడకన వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నామన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

కౌతాళం: స్థానిక పింజరిగేరి కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు శనివారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కాలనీకి రెండు నెలల నుంచి మంచినీరు సరఫరా కావడం లేదని వాపోయారు. ప్రస్తుతం గ్రామంలో ఉరుసు వేడుకలు జరుగుతున్నాయని, బంధుమిత్రులకు నీటిని కూడా అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ పాల్‌దినకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి వారిని సముదాయించి, రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీనివ్వడంతో వారు ఆందోళన విరమించారు.

విద్యాకానుక పంపిణీకి ఏర్పాట్లు చేయండి

ఆదోని సెంట్రల్: ఈ నెల 12వ పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని ఎంఈఓ బి.శివరాములు తెలిపారు. శనివారం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో పట్టణ, గ్రామీణ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల హెచ్ఎంల సమావే శం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏపీ పాఠశాలలో 1–10వ తరగతి వరకు ఎంత మంది విద్యార్థులు ఉన్నారో సరిచూసుకుని వాటి ప్రకారం కానుకలను సిద్ధం చేయాలన్నారు. పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులందరికీ కానుకలు అందజేయాలని ఆదేశించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అత్త, మామపై అల్లుడి దాడి



చికిత్స పొందుతున్న విరుపాక్షి

ఆదోని టౌన్ : పట్టణంలోని శాంతి ఎస్టేట్‌లో అత్త, మామ, భార్య, బావమరిదిపై అల్లుడు దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శాంతిఎస్టేట్‌లో నివాసముంటున్న విరుపాక్షి, శివలీల కుమార్తె లక్ష్మిని మాచనూరు గ్రామానికి చెందిన శివరాజ్‌కు ఇచ్చి వివాహం చేశారు. శుక్రవారం రాత్రి శివరాజ్ మద్యం మత్తులో ఇంటికొచ్చి భార్యతో గొడవకు దిగాడు. కుటుంబ సభ్యులు సర్ది చెప్పినప్పటికీ వినకపోగా వారితో కూడా ఘర్షణ పడ్డాడు. అంతటితో ఆగకుండా ఇంటి ముందున్న రాయితో అత్త,మామ, భార్యతో పాటు బావమరిది వివేక్‌పై దాడి చేసి పారిపోయా డు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. శనివారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసనాయక్ చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోసిగి: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన పులుసు తిక్కయ్య, మాదేవి దంపతుల కుమారుడు హనుమంతు (20) కర్నూలు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. హనుమంతు కౌతాళం మండలం మల్లనహట్టి గ్రామంలో అవ్వతాతల వద్ద నివాసం ఉంటున్నాడు. గ్రామంలో తనను మోసం చేశాడని ఓ అమ్మాయి కౌతాళం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసింది. దీంతో మన స్థాపానికి గురై శుక్రవారం కోసిగికు వచ్చి రంగప్ప గట్టు ప్రాంతంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు రెఫర్ చేశారు. అక్కడ కోలుకోలేక చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కౌతాళం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

కోసిగి: స్థానిక మోడల్ స్కూల్ సమీపంలోని పొలంలో బోయ గౌరమ్మ అనే మహిళపై బెంగి వీరేష్, బెంగి నర్సారెడ్డి శనివారం దాడి చేశారని బాధితురాలు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. కేసు నమో దు చేశామని కోసిగి ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

నేడు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

ఆదోని అర్బన్ : తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ మంగళ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ కమిటీ అధ్యక్షులు గౌడ్ ఈరన్న స్వామి, ధర్మప్రచార మండలి సభ్యు లు ఎన్.భీమిరెడ్డి, వి.శ్రీనివాసులురెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రంగస్వామి, నాగరాజు, అర్చకులు హనుమేష్ ఆచార్యులు, శ్రీహరి పాల్గొన్నారు.